క్లుప్తంగా

28న మహిళలకు వంటల పోటీలు

మురళీనగర్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న మహిళలకు వంటల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈస్ట్ పార్కులోని ఆడిటోరియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అటుకులతో స్వీట్ లేదా హాట్ తయారు చేయాల్సి ఉంటుందని చెప్పారు. మార్చి 1న మహిళలకు నడక పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తామని... ఆసక్తి కలిగిన మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తాటిచెట్లపాలెంలో నేడు పరస



తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా బుధవారం పరస, జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరస సందర్భంగా ఆలయ సమీపంలో రేలా రే రేలా, ఆట – పాట వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మార్చి 7న ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సడిమింటి సీతారామారావు, రాపేటి గోవింద్, కమిటీ అధ్యక్షుడు ఆళ్ల మధుసూధన నరసింగరావు పర్యవేక్షణలో దాతల సహకారంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు



అంగన్‌వాడీ వర్కర్లతో అధికారులు

మద్రిపాలెం : సమగ్ర శిక్ష, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ మేరకు జీవీఎంసీ 50వ వార్డు మాధవధార ఉన్నత పాఠశాలలో మంగళవారం ముగింపు సందర్భంగా సామాజిక, మేధ, భాష, సృజనాత్మక, శారీరక అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్క టీం నుంచి ఒక్కొక్కరు ఆచరణాత్మకంగా చేసి చూపించారు. అనంతరం సీడీపీవోలు రమణకుమారి, శారద చేతుల మీదుగా వారికి సర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3.50 లక్షలు అందజేత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందేవరకు అవసరమైన సహాయం అందజేస్తామని నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సహాయ కేంద్రం ద్వారా తీసుకున్న చర్యల్లో భాగంగా ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో చనిపోయిన గొల్లవిల్లి అప్పారావుకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలపాలైన యస్.వీర్రాజు, సిహెచ్.కామేశ్వర్‌సాయి, నీలి రాజులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని ఆయన తెలిపారు.



నక్కవానిపాలెంలో రాత్రి తెరిచి ఉన్న దుకాణాలు



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రాత్రి తెరిచి ఉన్న జ్యూస్ షాపు

అర్ధరాత్రి హాల్‌చల్

- నక్కవానిపాలెంలో ఇష్టారాజ్యంగా దుకాణాల నిర్వహణ
- ఆకతాయిలు, యువకుల చేష్టలతో భయాందోళనలు
- కానరాని రక్షక్ వాహనాలు, గస్తీ పోలీసులు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీల్లో అర్ధరాత్రి 12 గంటలు దాటే వరకు పలురకాల దుకాణాలు తెరిచే ఉంటున్నాయి. అక్కడ ఆకతాయిలు, మందుబాబులు, జులాయిలు హల్‌చల్ చేస్తుండడంతో స్థానిక నివాసులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో గల పలు దుకాణాలు రాత్రి 12 గంటల తర్వాత కూడా ఎంచక్కా తెరిచి ఉంచుతున్నారు. పాన్‌షాపులు, నూడిల్స్, ఫ్రూట్‌జ్యూస్ తదితర దుకాణాలు అర్ధరాత్రి దాటినా సరే యథేచ్ఛగా తెరిచి విక్రయాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా సరే ద్వారకా పోలీస్ స్టేషన్‌కి చెందిన రక్షక్ సిబ్బంది ఎక్కడ గస్తీ కాస్తున్నారో వారికే తెలియాలని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. రెండు రోజుల కిందట నక్కవానిపాలెంలో ఇందిరా గాంధీ పార్కు ఎదురుగా అర్ధరాత్రి సమయంలో కొందరు యువకులు హల్‌చల్ చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇందిరా గాంధీ పార్కు ప్రాంతం పరిధిలో ఎంవీపీ స్టేషన్ శాంతి భద్రతల విభాగం పోలీసులు రక్షక్ వాహనం ద్వారా నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు. నక్కవానిపాలెంలో గల వివేకానంద కల్యాణ మండపం రోడ్డులో కూడా రాత్రి పొద్దుపోయే వరకు మందుబాబులు నూసెన్స్ చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ద్వారకా పోలీసులు స్పందించి రక్షక్ సిబ్బంది ద్వారా రాత్రి విధిగా 10.30 గంటలకల్లా దుకాణాలు మూసి వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పొడుగునా...

సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు రోడ్డు పొడుగునా పలు దుకాణాలు రోజూ రాత్రి 12 గంటలైనా తెరిచే ఉంటున్నాయి. ఆయా ప్రాంతాల్లోని దుకాణాల వద్ద యువకులు మద్యపానం, ధూమపానంతో ఈ మార్గంలో వచ్చే ఇతర వాహన చోదకులు, పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మద్యం మత్తులో మందుబాబులు హల్‌చల్ చేయడంతో మహిళలు రాత్రి పూట బయటకి రావాలంటేనే హడలిపోతున్నారు. దుకాణాల నుంచి ఇంటికి వెళ్లే మహిళలు కూడా మందుబాబుల హడావిడితో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంబంధిత స్టేషన్ల రక్షక్ వాహనాల్లో పోలీసు సిబ్బంది వచ్చి ఆయా ప్రాంతాల్లో రాత్రి 10.30 గంటల తర్వాత తెరిచి ఉంచే షాపులను మూసి వేయించేవారు. కానీ ఇదంతా గతం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాత్రం రక్షక్ సిబ్బంది పత్తా లేకుండా పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఈ పరిసర ప్రాంతాల్లో దుకాణాల వద్ద ఏదో ఒక గొడవ జరుగుతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అటు ఎంవీపీ పోలీసులు, ఇటు ద్వారకా స్టేషన్ పోలీసుల గస్తీ అంతంతమాత్రం కావడంతో స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనచోదకులు భయపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రౌడీషీటర్లు కూడా గొడవలు సృష్టిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల ప్రాంతాల్లో రాత్రి పూట రక్షక్ వాహనాల ద్వారా నిఘా పెంచి... దుకాణాల నిర్వాహకులతో పాటు ఆకతాయిలు, మందుబాబులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'కాశికా ప్రకాశిక' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న గాదె మాణిక్యాలరావు

సీతంపేట : ప్రముఖ కవి రాంభట్ల నృశింహశర్మ రచించిన 'కాశికా ప్రకాశిక' (గాంగేయ తారావళి) పాటల పుస్తకం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. గాదె మాణిక్యాలరావు చేతుల మీదుగా పుస్తకం ఆవిష్కరించి తొలి ప్రతిని స్వీకరించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ రచయిత రాంభట్లను అభినందిస్తూ శివరాత్రి ఒక రోజు ముందే వచ్చిందని, కాశీ ప్రస్థానం బాగుందన్నారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పుస్తకాన్ని సమీక్షిస్తూ రాంభట్ల గేయ రచనా విధానాన్ని ప్రశంసించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ ఆశీర్వాద వచనాలు పలికారు. ఈ సందర్భంగా గోపినంబాళ శేషాచార్యులు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామారావు, మాధురీదేవి, టేకుపల్లి లలిత, అక్కునపల్లి శైలజ, రాంభట్ల ప్రణయవంశీ పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం



ఉమానీలకంఠేశ్వర స్వామి

సీతమ్మధార : కోరిన కోర్కెలు తీర్చే దేవదేవుడిగా ప్రసిద్ధిగాంచిన జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో కొలువైన ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయం శివరాత్రి మహోత్సవాలకు సిద్ధమైంది. నగరంలోని పురాతన శివాలయాల్లో ఈ ఆలయం ఒకటి. ఏ శివాలయంలోనూ లేని విధంగా నీలకంఠుడు ఇక్కడ పశ్చిమ దిశగా కొలువై ఉండటం విశేషం. శివరాత్రి, కార్తిక మాసంలో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు చేసుకుంటారు. కాలక్రమంలో వినాయకుడు, అమ్మవారు, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా, దత్తాత్రేయ, రావిచెట్టు నాగమ్మ ఉపాలయాలు ఈ ప్రాంతంలో నిర్మించారు. శివరాత్రి పర్వదినాన్ని ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. తెల్లవారుజామున నీలకంఠుడికి ప్రత్యేక అభిషేకాలు, హారతులు సమర్పిస్తారు. లింగోద్భవ సమయంలో రాత్రి 11 గంటలకు మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన చేస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పీవోడబ్ల్యూల విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రగతి శీల మహిళా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార: మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులో నిర్వహించనున్న రెండు ప్రగతిశీల మహిళా సంఘాల రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి దేవి మీడియాతో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కోరుకునే ప్రతీ మహిళ స్మరించుకోవాల్సిన రోజైన మార్చి 8న ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రెండు పీవోడబ్ల్యూలు ఏకమవుతాయన్నారు. పోరాటాల ద్వారానే హక్కులు సంక్రమిస్తాయన్నారు. జిల్లాలోని మహిళలందరూ ఒంగోలులో జరగనున్న రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని రోహిణి కోరారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పౌర గ్రంథాలయంలో జిల్లా స్థాయి సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలోఁ పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా ఆఫీసు బేరర్ బాలనాగమ్మ, కార్యవర్గ సభ్యులు ఈసర లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతా

పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి



మాట్లాడుతున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి

డాబాగార్డెన్స్: ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకునేందుకు, ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తేందుకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విజ్ఞప్తి చేశారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు యూటీఎఫ్ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. శాసన మండలంటే పెద్దల సభని, అటువంటి సభలో పీడీఎఫ్ తరపున గెలుపొంది, ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకతీతంగా, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నారని తెలిపారు. జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీనిచ్చిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ జీవో ఇప్పటికీ రద్దు చేయలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదే జరిగితే మరిన్ని పాఠశాలలు మూతపడతాయని, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోతాయని, ఫలితంగా ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల సహకారంతో తాను ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే జీవో 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీనిచ్చారు. పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీల జోక్యం ఈ ఎన్నికల్లో ఉండడం భావ్యం కాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, దాసరి నాగేశ్వరరావు, చందోలు వేంకటేశ్వరరావు, వై.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత తల్లి చెంతకు



తల్లి కృష్ణాబాయ్‌తో వాసుదేవ్

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఏయూటీడీ సిబ్బంది చికిత్స అందించి తల్లి చెంతకు చేర్చారు. నాలుగేళ్ల తర్వాత తల్లీకుమారుడు కలుసుకున్నారు. మహారాష్ట్రలోని హింగోళి జిల్లా పరిధి గోరెగావ్ గ్రామానికి చెందిన వాసుదేవ్ మానసిక వ్యాధితో బాధపడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం ఇంటి నుంచి వచ్చేసిన వాసుదేవ్ కొన్నాళ్లు వేర్వేరు ప్రాంతాల్లో తిరిగి గత ఏడాది అక్టోబర్ 5న విశాఖ చేరుకున్నాడు. అక్కడి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అనంతరం ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు చికిత్స అందించారు. కోలుకున్నాక వాసుదేవ్‌ను స్వగ్రామం తీసుకెళ్లి తల్లి కృష్ణాబాయ్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నాలుగేళ్ల తర్వాత కొడుకుని చూసిన ఆమె చాలా సంతోషించిందని తెలిపారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు, సెక్రటరీలకు, ట్యాక్స్ కలెక్టర్లకు మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లోని సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, ఆర్ఐలు సిబ్బంది నిర్దేశించిన టార్గెట్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. పాత బకాయిలు, మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పన్ను చెల్లింపులు చేసే వారి నుంచి చెక్‌లు తీసుకోకుండా డీడీలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

చట్టపరమైన దత్తతను ప్రోత్సహించాలి



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న గొండు సీతారాం, తదితరులు

మద్రిపాలెం : అధికారిక, చట్టపరమైన దత్తతను ప్రోత్సహించాలని, ప్రభుత్వం రూపొందించిన కారా చట్టం ద్వారానే దత్తత తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారం అన్నారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ సమీపంలో ఉన్న శిశు గృహలో మూడేళ్ల చిన్నారి (బాలిక)ని తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన మోహన్ రాజ్, సత్య దంపతులకు కారా చట్టాన్ని అనుసరించి అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ అధికారిక దత్తత వల్ల పిల్లల భవిష్యత్ సురక్షితంగా ఉంటుందన్నారు. అనధికారికంగా చిన్నారులను దత్తత తీసుకోవడం ద్వారా కలిగే అనర్థాలపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అధికారికంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు సొంత బిడ్డల కంటే ఎక్కువ అభిమానంతో పిల్లలను పెంచి వారిని అన్ని విధాలా సంరక్షించాలని సూచించారు. కారా చట్టాన్ని అనుసరించి ప్రభుత్వ అధికారిక దత్తతల పైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు ఎంఆర్ఎల్ రాధ, సీడీపీవో రమణకుమారి, బాలల సంరక్షణ విభాగం పీవోఎన్ఐసీ మమత, కమిషన్ సభ్యులు రజని, విజయలక్ష్మి, సూర్యనారాయణ, లక్ష్మి, శిశు గృహ మేనేజర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

వినయమే ఉజ్వల భవిష్యత్‌కు పునాది



మాట్లాడుతున్న ఏయూ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య నానాజీ

సీతంపేట: విద్య, వినయమే యువత ఉజ్వల భవిష్యత్‌కు పునాది అని ఆంధ్ర విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జి.నానాజీ అన్నారు. స్థానిక బీవీకే కళాశాలలో మంగళవారం డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే గురువులు, పెద్దలను గౌరవిస్తే నేర్చుకున్న విద్య జీవితకాలమంతా కాపడుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎం.పట్టాభిరామారావు మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్య అందించడంలో ఎప్పుడూ బీవీకే కళాశాల ముందుంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీవీకే విద్యా సంస్థల కార్యదర్శి వి.రామ సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్దకాలంగా బీవీకే కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ పూసపాటి వెంకటపతిరాజు విద్యార్థులకు కాన్సెప్షనల్ లెర్నింగ్ మెలకువలు వివరించారు. ప్రిన్సిపాల్ రత్నశేఖర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పల్సస్ ఉద్యోగులకు తక్షణమే జీతాలివ్వాలి

డాబాగార్డెన్స్: రుషికొండ ఐటీ సెజ్‌లోని పల్సస్ హెల్త్ టెక్ సంస్థలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులకు బకాయి పడ్డ 4 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఎంతో నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులతో అతి తక్కువ జీతాలతో పని చేయించుకుంటూ, ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పల్సస్ యాజమాన్యం జాబ్‌మేళా పేరిట ఐటీ విద్యార్థులను క్యాంపస్ సెలక్షన్ పేరిట ఎంపిక చేసి, వారికి జీతాలు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందుతున్న పల్సస్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటుందని పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగస్తుల జీతాల్లో కోతలు ఆపాలని, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలని, బకాయి పడ్డ 4 నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగులకు అండగా సిటూ పోరాడుతుందని తెలియజేశారు.

ఎరుకుమాంబ ఆలయానికి శివరాత్రి శోభ

నేడు అభిషేకాలు నిలిపివేత



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అన్నపూర్ణ

సీతమ్మధార: దొండపర్తిలోని శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జీవీ రమాబాయి తెలిపారు. బుధవారం శివరాత్రి సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, భక్తుల రద్దీ దష్ట్యా పసుపు నీళ్ల అభిషేకాలు నిలిపివేస్తున్నామని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. శివరాత్రి సందర్భంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమ్మవారికి కుంకుమ పూజలు చేశాక భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మార్చి 6న గురువారం మారువారం పండగ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని రమాబాయి విజ్ఞప్తి చేశారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ ఆలయాన్ని సందర్శించారు. శివరాత్రి కోసం చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో ధ్రువపత్రాలివ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

డాబాగార్డెన్స్: ప్రజలకు అందించే జనన, మరణ, కుల, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలను ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయంలో జారీ చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. వెంకటశేషమ్మ పేర్కొన్నారు. జీవీఎంసీ జోన్–4 సూర్యాబాగ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా ధ్రువపత్రాల జారీ ప్రక్రియపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రతో కలిసి మంగళవారం నిర్వహించిన సెన్సిటైజేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనన, మరణ సర్టిఫికెట్లు జారీ చేసే విషయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యంతో 6 నెలలకోసారి సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ధ్రువపత్రాల జారీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు.. అధికారులు, ఉద్యోగులకు సెన్సిటైజేషన్ కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–1,2,3,7 జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.